## క్లుప్తంగా

### ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు



**డోర్నకల్:** డోర్నకల్‌కు చెందిన విద్యార్థి వాంకుడోత్ స్వరణ్‌సింగ్ ఖరగ్‌పూర్ ఐఐటీలో మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లోనే మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన రాజునీల దంపతుల కుమారుడు స్వరణ్‌నాయక్ జేఈఈ మెయిన్స్‌లో 85శాతం మార్కులు, జేఈఈ అడ్వాన్స్ ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 464 మార్కులు సాధించాడు. తల్లి అంగన్‌వాడీ టీచర్‌గా, తండ్రి మత్స్యకారుడిగా పనిచేస్తున్నారు.

### లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి



**మరిపెడ:** లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న అన్నారు. మరిపెడలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, కనీస వేతనాల కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ జిల్లా మహాసభలను మరిపెడలో నిర్వహించ తలపెట్టినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, నాయకులు బిక్షం, ముత్తయ్య, వెంకన్న, సైదులు, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



**మహబూబాబాద్ రూరల్:** ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హోమియో వైద్యుడు యాస తిరుమల్ అన్నారు. మానుకోటలోని సత్యజయ్ హోమియో క్లినిక్ ఆధ్వర్యంలో మండలంలోని కంబాలపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో, ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

### ఆలయంలో చోరీకి యత్నం

**బయ్యారం:** మండలంలోని సత్యనారాయణపురంలోని రామాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయంలోకి గడ్డపారతో చేరిన వ్యక్తులు హుండీని పగులకొట్టేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో స్థానికులు మేల్కొనటంతో చోరీకి వచ్చిన వ్యక్తులు తమ వెంట తెచ్చుకున్న గడ్డపారను ఆలయంలో వదిలి పారిపోయారు. ఈ మేరకు ఆలయకమిటీ బాధ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా బాలకృష్ణ

**మరిపెడ రూరల్:** సీపీఐ మహబూబాబాద్ జిల్లా సమితి సభ్యుడిగా మరిపెడ మండలం నీలికుర్తి గ్రామానికి చెందిన మారగాని బాలకృష్ణ ఎన్నికయ్యాడు. ఈనెల 5,6 తేదీలలో కురవి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించగా బాలకృష్ణను జిల్లా సమితి సభ్యుడుగా నియమించినట్లు తెలిపారు.

### ఆత్మహత్యాయత్నం

**మహబూబాబాద్ రూరల్:** అప్పుల బాధతో టీస్టాల్ నిర్వాహకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి భార్య సునీత తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో టీస్టాల్ నిర్వహించే మాలోత్ హరికిషన్ కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.15లక్షలకు పైగా అప్పులు తీసుకున్నాడు. హరికిషన్ అధిక వడ్డీలు చెల్లిస్తూ వస్తున్నాడు. అయినప్పటికీ అప్పులు ఇచ్చిన వారు తమ డబ్బులు తమకు కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో ఆదివారం మనస్తాపానికి గురైన హరికిషన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు బంధువులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

### సన్మానం



**నెహ్రూసెంటర్:** జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్‌కు ఉత్తమ డాక్టర్ అవార్డు రాగా టీవీవీపీ, టీఎస్‌జీఓస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీవీవీపీ కోర్ కమిటీ సభ్యుడు బైరపాక శ్రీనివాస్, టీఎస్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, పాలకుర్తి వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యుత్ మోటార్లు కాలుతున్నయ్..

- లో ఓల్టేజీతో విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఆందోళన చెందుతున్న రైతులు



మోటార్‌కు మరమ్మతు చేస్తున్న మెకానిక్



వరినాట్ల పనుల్లో కూలీలు

**డోర్నకల్:** లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయంతో విద్యుత్ మోటార్లు కాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మున్నేరు, ఆకేరు పరివాహక ప్రాంతాల్లో వరినాట్ల పనులు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల కింద వరి, మిరపనార్లు సిద్ధమవుతుండగా పత్తి విత్తనాలు మొలకెత్తాయి. పలు ప్రాంతాల్లో వ్యవసాయ బావుల ఆధారంగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు మున్నేరు, ఆకేరువాగులు, వ్యవసాయ బావులకు విద్యుత్ మోటార్లు అమర్చి సాగు పనులు చేస్తున్నారు. కొన్ని రోజులుగా నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం, లోఓల్టేజీ సమస్యలతో విద్యుత్ మోటార్లు నడవక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో విద్యుత్ సమస్యలతో మోటార్లు కాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డోర్నకల్ సబ్‌స్టేషన్ పరిధిలో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. కొత్తలింగాల సబ్‌స్టేషన్ నుంచి కొత్తలింగాలతోపాటు డోర్నకల్, గార్ల సబ్‌స్టేషన్లను విద్యుత్ సరఫరా అవుతుండటం, సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య తలెత్తిన మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా నిలుస్తుండటంతో సాగు పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

## మరమ్మతులు చేయించాలి

**కేసముద్రం:** మున్సిపాలిటీ పరిధి కేసముద్రం విలేజ్‌లోని వాటర్ ట్యాంక్ బజారులో గల బోరు మోటారు ఏడు నెలల క్రితం చెడిపోయింది. ఈ బోరుపై ఆ కాలనీలోని సుమారు 60 కుటుంబాలు ఆధారపడగా, ఇప్పుడు బోరు మోటారు చెడిపోవడంతో తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్న మరమ్మతులు చేయించడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఓవర్ హెడ్‌ట్యాంకులు శుభ్రపరచక సుమారు నాలుగు సంవత్సరాలు దాటిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు

- మాజీమంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్ అర్బన్:** బీసీ ఓట్ల కోసమే కాంగ్రెస్ నాయకులు బీసీ రిజర్వేషన్ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బీసీ ఆర్డినెన్స్‌పై ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతి, గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్ తీసుకురావాలని అనడం విడ్డూరమన్నారు. గ్రామంలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి రెండు సంవత్సరాలు గడిచిందని, దీంతో గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయిందన్నారు. అనంతరం మాజీ ఎంపీ కవిత మాట్లాడుతూ.. ఓట్ల కోసం కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ పేరిట అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని మోసపూరిత హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకన్న, నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, తేళ్ల శ్రీనివాస్, యాకుబ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బీసీలను మోసం చేయడానికే ఆర్డినెన్స్ డ్రామా

**కురవి:** సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మరోసారి మోసం చేయడానికే ఆర్డినెన్స్ డ్రామా ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విమర్శించారు. ఆదివారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ చెప్పాడని బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ పేరిట కొత్త నాటకానికి తెరలేపాడన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, చిన్నం భాస్కర్, కొణతం విజయ్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన 1989–1992 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలుసుకున్నారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కళాశాలకు సౌండ్‌బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లం నవీన్, రేణిగుంట్ల విశ్వేశ్వరరావు, కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి, తోట శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, నాగేశ్వరరావు, విజయ్, వెంకట్‌రెడ్డి, సురేందర్, మాధవి, అనేరాధ, శ్రీలత, ఉపేంద్రమ్మ, శోభారాణి, పుష్పలీల పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మించడంలో పాలకుల విఫలం

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాస్





మాట్లాడుతున్న శ్రీనివాస్

**గార్ల:** పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించడంలో పాలకులు వైఫల్యం చెందారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరయ్యాయని నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మంత్రులను పిలిచి బ్రిడ్జి నిర్మాణంకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారన్నారు. దశాబ్దాల కాలం నుంచి పాలకులు మారుతున్నారే తప్పా, బ్రిడ్జి నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్న చందంగా ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, జనార్దన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## నారుమడిలో మెళకువలు తప్పనిసరి

**గూడూరు:** ప్రస్తుతం ఖరీఫ్ సాగు కోసం రైతులు వరి నారు పెంపకం చేపట్టారు. నారు పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండి. అబ్దుల్‌మాలిక్ ఆదివారం రైతులకు పలు సూచనలు చేశారు. మొదటగా నారుమడిని బాగా దున్ని మూడు సార్లు దమ్ముచేసి చదును చేయాలన్నారు. మడిలోకి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని దుక్కిలో చల్లాలని తెలిపారు. నారు నాటిన తరువాత ప్రతీ రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవిధంగా రైతులు సూచనలు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి వివరించారు. సాగులో సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.



నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి

# ప్రతి పేదవాడికి భరోసా కాంగ్రెస్ పార్టీ



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**మహబూబాబాద్ రూరల్:** ప్రతి పేదవాడికి భరోసా కాంగ్రెస్ పార్టీ అని, ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తున్నారని ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్‌నాయక్ అన్నారు. రేషన్ కార్డుల జారీ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాంనాయక్, శాసన సభ్యులు భూక్యా మురళీనాయక్, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యానాయక్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు, విజయ లక్ష్మి, ముంజాల రాజేందర్ గౌడ్, సీతారాములు, వీరభద్రం గౌడ్, శంకర్ నాయక్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

## తవ్వారు.. వదిలేశారు

**డోర్నకల్:** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో అమృత్ పథకంలో భాగంగా పైపులైన్ ఏర్పాటు కోసం జరుపుతున్న తవ్వకాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ కోసం వీధుల్లో రోడ్లను తవ్వి రోజుల తరబడి తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గతంలో గాంధీసెంటర్, యాదవనగర్, జెడ్పీస్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి పదిరోజులపాటు గుంతలను పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైపులు పగిలి నీరు వీధుల్లోకి వచ్చి బురదమయంగా తయారవుతున్నాయి. అధికారులు స్పందించి పైపులైన్ ఏర్పాటు పనులను పూర్తి చేసి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల ఎదుట పైపులైను తవ్వకాలు

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**గూడూరు:** ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన నిరుపేదలకే కేటాయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెల్పూరు వెంకన్న, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని పీఎం నరేంద్రమోదీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణకు అనేక ఇళ్లు ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన ఇళ్లను తెలంగాణ ప్రభుత్వం పేరు మార్చి ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పడాల నాగరాజు, గుండెబోయిన మల్లేష్‌యాదవ్, పుట్ట ఐలయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# కుమ్మరుల సంక్షేమానికి పాటుపడాలి



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

**తొర్రూరు రూరల్:** కుమ్మరుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలని సంఘం నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల సోమయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో కుమ్మరి సంఘం వారి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో కుమ్మరులు తయారు చేస్తున్న కుండలు, రంజాన్లను కొనుగోలు చేసే నాథుడే లేక ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కుమ్మరి కులస్తులకు ప్రత్యేక రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కొండాపురం సైదులు, వెలిశాల సమ్మయ్య, యాకయ్య, లింగయ్య, నర్సయ్య, లక్ష్మి, సంపత్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షుడిగా జలీల్

**గార్ల:** తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షుడిగా గార్లవాసి ఎంఏ జలీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**బయ్యారం:** మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభను ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు మాస్‌లైన్ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం తెలిపారు. ఆదివారం బయ్యారంలో వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లచ్చయ్య, ధనుంజయ, పూర్ణ, వెంకన్న, జాని పాల్గొన్నారు.

### భగవద్గీత గ్రంథ ప్రచారం

**కేసముద్రం:** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అనంతపురం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథ ప్రచారాన్ని ఆదివారం చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, వీరస్వామి, నవ్యశ్రీ, ఆర్యవర్ధన్, హర్షవర్ధన్, సుధాకర్, పాపక్క, హేమలత, సుమలత, లలిత, సుష్మ పాల్గొన్నారు.

### బియ్యం అందజేత

**కేసముద్రం:** మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌కి చెందిన వి.సాలమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు ఆదివారం టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్ సహకారంతో బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కత్తెరశాల శ్రీనివాస్, చిట్ల రవి, బైరు వెంకన్న, కీర్తి సురేందర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడి మృతి

**కురవి:** మండలంలోని సూదనపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గాండ్ల లింగయ్య గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందులు సూదనపల్లి గ్రామానికి వచ్చి లింగయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఫార్మర్ ఐడీ తప్పని సరి

**పెద్దవంగర:** రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటే ప్రతి రైతు ఫార్మర్ తప్పనిసరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వామినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

### ప్రజల ఆత్మ గౌరవాన్ని పెంచింది టీడీపీనే

**తొర్రూరు రూరల్:** తెలుగు రాష్ట్రాల్లోని అన్నివర్గాల ప్రజల ఆత్మ గౌరవాన్ని పెంచింది టీడీపీ పార్టీనే అని పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామంలో టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సైతం అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోగ భాస్కర్, శోభరాణి, అంజలిదేవి, స్వప్న, వెంకన్న, అనిల్, శ్రీను, సిద్ధయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య గొడవ

**తొర్రూరు రూరల్:** మండలంలోని చెర్లపాలెం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి వర్గీయులు నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాన్ని తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి వర్గీయులు ఆదివారం అడ్డుకున్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్నిగ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేస్తుండగా, ఝాన్సీరెడ్డి, తిరుపతిరెడ్డిల సొంత గ్రామమైన చెర్లపాలెంలో సైతం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తుండగా మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి వర్గీయులు మండల పార్టీ నాయకులతో గొడవపడి టెంట్ కూల్చివేసి, కుర్చీలు ధ్వంసం చేసి సమావేశాన్ని అడ్డుకోగా, సర్ది చెప్పే ప్రయత్నం చేసిన కార్యకర్తలు శాంతించకపోవడంతో సమావేశాన్ని రద్దు చేసి వెళ్లిపోయ్యారు.

### మాజీ మంత్రి పరామర్శ

**మరిపెడ రూరల్:** మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన డీఎస్పీ కొండం పార్థసారథి మాతృ మూర్తి కొండం అనసూయ (80) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ జెడ్పీ చైర్మన్ అంగోతు బిందు, గుడిపూడి నవీన్ ఆదివారం అనసూయ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

### ఆర్థికసాయం

**గార్ల:** మండలంలోని సీతంపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తాటి వెంకటేష్(32) కుటుంబ సభ్యులకు గ్రామస్తులు ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో శంషాద్‌బేగం, గండు శ్రీనివాస్, భూక్యా సర్వేష్, సంపసాల ఉపేందర్, భిక్షపతి, ఉష ఉన్నారు.

### పోరాట యోధుడు యుగేందర్

**కొత్తగూడ:** పీడిత ప్రజల విముక్తి కోసం అలుపెరుగని ఉద్యమాలు చేసిన పోరాట యోధుడు యుగేందర్ అని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మండల వెంకన్న, చిన్న చంద్రన్న, ప్రభాకరన్న, శ్రీశైలం, సూర్యం, వెంకటయ్య పాల్గొన్నారు.

# చిన్నారులకు బహుమతుల ప్రదానం



బహుమతులతో చిన్నారులు

**డోర్నకల్:** సమ్మర్ స్విమ్మింగ్ క్యాంప్–2025 పేరుతో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. డోర్నకల్‌కు చెందిన కొలిపాక పుల్లారావు సమ్మర్ స్విమ్మింగ్ క్యాంప్–2025 పేరుతో డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగులో చిన్నారులకు ఈత నేర్పించాడు. శిక్షణ అనంతరం స్విమ్మింగ్ పోటీలు నిర్వహించాడు. అనంతరం జైన్ భవన్‌లో ఈత పోటీలలో విజేతలతోపాటు శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే హైస్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం పండల సుబ్బారావు, సీనియర్ కోచ్‌లు బొమ్మన అశోక్‌కుమార్, పోటు జనార్దన్, నాయకుడు పుట్టా శ్రీనివాస్, క్యాంప్ నిర్వాహకులు పుల్లారావు, సత్యనారాయణ, భాస్కర్, రమేష్, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

**కురవి:** పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నేరడ గ్రామంలో చోటుచేసుకున్నట్లు కురవి ఎస్సై గంద్రాతి సతీష్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నేరడ గ్రామానికి చెందిన ఇరుగు లక్ష్మీ (42) మద్యం తాగుతుందని కుటుంబ సభ్యులు వారించినట్లు తెలిపారు. దీంతో మనస్తాపంతో లక్ష్మీ గడ్డిమందు తాగి గత నెల 22న ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పరిస్థితి బాగాలేక పోవడంతో మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డు పక్కన కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

**గూడూరు:** మండల కేంద్రం నుంచి కేసముద్రం వెళ్లే మార్గంలో బొల్లెపల్లి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పశువులు, ఇతర వాహనాలు, ప్రయాణికులు వెళ్తుంటారు. కానీ ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకుండా ఏర్పాటు చేయడం, రోడ్డు పక్కనే ఉండడం ప్రమాదానికి సూచకంగా నిలిచింది. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలని, లేదా చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.